ఇద్దరం ఫలహారం చేశాం. ఏకశయ్యాగతులయ్యాం. నేనామెను దగ్గరికి తీసుకున్నాను. చేత్తో ఆమె వీపునూ, తలనూ నిమిరసాగాను. ఆమె గువ్వలా నా డొక్కలోకి ముడుచుకుపోయింది.

రెండు నిముషాల్లో ఆమె నిద్రలోకి జారుకుంది. మధ్యాహ్నం అతిగా నిద్రపోవడం వల్ల నాకు నిద్ర పట్టలేదు. లేచి కుర్చీలో కూర్చుని ఆమె వైపు తదేకంగా చూస్తూ ఉండిపోయాను. నాకాలోచనలు వచ్చాయి. పెళ్ళయిన ఈ ఆర్నెల్లలోనూ పాలు నీళ్ళులాగా నాతో కలిసిపోయిందేగాని ఏనాడు ఎడ్డమంటే తెడ్డెం అనలేదు ఈ అమ్మాయి. ఇట్లాంటి పిల్ల లోకం దృష్టిలో పెద్దగా తప్పుగాని విషయాన్ని పెద్ద తప్పుగా భావించి ఎంత తల్లడిల్లిపోయిందో! ఏదైనా తప్పుచేస్తే ఇంకెంత తల్లకిందులౌతుందో!.

'ఎంత ముగ్ధ ఈమె ! ఎంత స్వచ్ఛ ఈమె! ఈమె మనస్సు స్ఫటికం! ఇట్లాంటి మనసు నా సొంతం అవటం ఎంతదృష్టం !... అమ్మో ఈమెను కాకుండా ఇంకెవరినైనా చేసుకునుంటే నేనెంత నష్టపోయుండేవాడినో. ఈ మనసు నాకు కావాలి శాశ్వతంగా కావాలి! ఇదేనా ప్రేమంటే! ఇదేనా లవ్వంటే! అవ్వనీ! చటుక్కున వెళ్ళిపోయి నా క్షీరాబ్ధి కన్యకను ముద్దు పెట్టుకున్నాను. ఆమె చెవిలో ఊదాను.

"క్షీరా నా క్షీరా , ఐ లవ్ యు! ఐ .. లవ్వ్వ్ యూ్యా...!

(ఆంధ్రప్రభసచిత్ర వారపత్రిక 24-10-90)

★★★ ★★★ ★★★

# క్విట్ ఇండియా ఉద్యమం!

"బావా బావా నీ కొడుకు జిల్లా ఫస్టు వచ్చాడు. ఇదుగో పేపరు"! వారణాసి రావు పదోతరగతి ఫలితాలున్న పేపరును తన బావ సూర్యారావు కిచ్చాడు.

సూర్యారావు పేపరు చూసాడు. అన్నాడు- " నీ కొడుక్కు ఫస్టుక్లాసు వచ్చింది గదా! అది మాత్రం తక్కువా! ఇద్దరికీ ఆనందమే !"

" మీ వాడికి జిల్లా ఫస్టు రావడం సహజమే. కానీ మా వెధవకు కూడా జిల్లాలోనే ఏ సెకండు ర్యాంకో థర్డ్ ర్యాంకో రాకూడదా!... ఈ ముండమోపి పదవ క్లాసులోనే ర్యాంకు తెచ్చుకోలేక పోతే పై క్లాసుల్లో ఎట్లా తెచ్చుకుంటాడు. అమెరికా ఎట్లా వెళతాడు?" వారణాసి రావు నిట్టూర్చాడు.

" అంటే మీ వాణ్ణి అమెరికా పంపించాలనుకుంటున్నావన్నమాట!.. చెప్పావుకాదూ !" సూర్యారావు పేపరు పక్కకు పెట్టి కుతూహలంగా ముందుకు వంగాడు తన బావమరిదివైపు.

వారణాసిరావుకి ఊపొచ్చింది " తప్పదయ్యా తప్పదు ! అమెరికా వెళ్ళక తప్పదు. కనీసం వెస్ట్ జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, ఆఖరికి ఇటలీ, ఇండీస్ ఎట్లాగోట్టా కనీసం మాస్కో అయినా సరే! అసలీ దేశంలో ఏముందని ఇక్కడుండాలయ్యా! ఉద్యోగాల్లేవు. కోట్లుంటేగాని వ్యాపారం చెయ్యలేము. రాజకీయాల దుర్వాసన. అంతటా అవినీతి. అక్రమాలు. అన్నీ కంట్రోళ్ళు అసలు క్యూలో లేకుండా ఒక్కరోజన్నా గడుస్తుందా నిత్యమున్నూ! మన మెట్లాగు ఈ కశ్మలంలోంచి బయటపడేది లేదు కనీసం మన

పిల్లలనయినా బయటపడి సుఖపడనియ్యవయ్యా... అసలు బావా, మీ వాణ్ణీ కూడా ఫారిన్ పంపించే విషయం ఎందుకాలోచించకూడదు. మావాడు, మీవాడు ఇద్దరు పోటీల మీద వస్తున్నారు కదా. పోటీల మీదనే విమానం ఎక్కుతారు. ఏమంటావ్!''

సూర్యారావు నవ్వాడు. తల వెనక్కు చేతులు పెట్టుకుని కుర్చీలో విశ్రాంతిగా వెనక్కువాలాడు. అన్నాడు. ''నువ్వు చెప్పింది రైటే! కానీ ఈ అక్రమాలు, అవినీతి, కంట్రోళ్ళు, మొరటు తనం -ఇవన్నీ మొదట్నుంచీ ఉన్నాయా? అంటే కనీసం మన చిన్న తనం నుంచీ ఉన్నాయా? కొత్తగా ఇటీవల వచ్చి పడ్డాయి కదా! ఇవి పెరుగుతున్న వేగం చూస్తుంటే మన ముసలి తనంలో మనల్ని ఈడ్చి పారేసేందుక్కూడా జనం ఉండరేమోనని భయంవేస్తోంది. ఈ భయం ఇంత మోతాదులో మన పెద్దలకుండేదా-లేదుకదా?''...'' అదేలే, స్వార్ధ రాజకీయాల మూలంగానే దేశం ధ్వంసం అయ్యిందనేగా నువ్వు చెప్పేది. అది తెలుస్తూనే ఉంది!''... '' మరింకేం? మనచేత్తో మనం ఆ రాజకీయాల్ని సరిదిద్దుకోగలం కదా! ఇదీ ఎంత తొందరగా జరిగితే దేశం అంత తొందరగా బాగుపడుతుందికదా!''

'' నాకు నమ్మకం లేదు. పోనీ బాగుపడిందనుకో. ఏదో తిండికి లోటుండదేమోకాని, లక్షలకు లక్షలు సంపాదించటం వీలవుతుందా? మన పిల్లలు స్వర్గసుఖాలు అనుభవించ గల్గుతారా! అదే అమెరికాలో అయితే, ఆహా‹ అక్కడ లేని సుఖం ఉందా? కాన్ఫరెన్సు నుంచో హనీమూన్ నుంచో కారులో ఇంటికొస్తూ చేతిలో ఉన్న స్విచ్‌ని నొక్కితే- అరవై మైళ్ళదూరంలో ఉన్నా - ఇంట్లో కుక్కర్లో అన్నం ఉడకడం మొదలవుతుందట. గీజర్‌లో నీళ్ళు కాగటం మొదలవుతుందట. ఇంట్లోఉన్న కంప్యూటర్ దానికిచ్చిన ప్రోగ్రామ్ ప్రకారం ఇల్లు ఊడ్పించేసి, మంచాలు దులిపించేసి, ఎంచక్కా రడీగా ఉంచుతుందట టి.వి.లో వస్తున్న బొమ్మల్లో మనం కోరుకున్న భాగాన్ని మాత్రమే ఎన్‌లార్జిచేసి తెరంతా పరిపించి చూడొచ్చట. అట్లా కావలసినంత సేపు తెరమీద దాన్ని నిలబెట్టి ఆ తర్వాత తీసేసి, అక్కడ్నుంచి ప్రసారమవుతున్న కథలో మిగిలిన భాగం చూడొచ్చుట. టూత్ బ్రష్షులు ఎలక్ట్రిక్‌విట తెలుసా!''

'' ఆ ఏంటయ్యా నువ్వు చెప్పేది ! ఎంతసేపూ శరీరసుఖాలు గురించేగదా! మరి మానసిక సుఖం విషయం ఏమిటి ! ప్రతి అయిదుగురిలో ముగ్గురు ఎప్పుడో ఒకప్పుడు పిచ్చాసుపత్రి కెళ్ళొచ్చిన వాళ్ళే గదా ఆ అమెరికాలో ! .. శాంతెక్కడేడ్చిందయ్యా అమెరికాలో!''

'' సూర్యారావు బావా, నువ్వు వెయ్యి లక్ష చెప్పు. అమెరికా అమెరికాయే. మా అబ్బాయిని నేను కన్నది- వాడు అమెరికాలో ఒక వెలుగు వెలగటానికేనయ్యా!''... '' మా అబ్బాయిని నేను కన్నది, వాడు తన జీవితం వల్ల ఈ దేశంలో తన కన్నా నికృష్టులు, దౌర్భాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపటానికి. సర్లే, వాదనెందుకు! ఎవరి గమ్యం వారిది, ఎవరి ప్రయత్నం వారిది!''

'' వెళ్ళొస్తా '' - వారణాసిరావు లేవబోతూండగా సూర్యారావు ఇంట్లోంచి కాఫీ తెప్పించి ఇచ్చాడు. కాఫీ తాగి వారణాసి రావు వెళ్ళిపోయాడు.

★ ★ ★

ఒక ఏడాది గడిచింది. బావమరుదుల పిల్లలిద్దరు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు చాలా మంచి మార్కులతో పాసయ్యారు. వారణాసిరావు కొడుకు ఆటల్లోనూ, సాహిత్యపు వ్యాసంగాల్లోనూ పోటీల్లో మొదటి బహుమతులు తెచ్చుకుంటుంటే, సూర్యారావు కొడుకు విజ్ఞానశాస్త్రాన్ని మధిస్తూ పత్రికలకు

వ్యాసాలుకూడా రాసేస్తున్నాడు.

వారణాసిరావు ఏదో సందర్భంలో సూర్యారావుని తన ఇంటికి భోజనానికి పిలిచాడు. పిల్లల భవిష్యత్తు మీదకు సంభాషణ మళ్ళింది సూర్యారావు అడిగాడు "అమెరికా ఎప్పుడు పంపిస్తారు పిల్లాడ్ని? ఇంటర్ అయ్యాకా, బి. ఇ. అయ్యాకా, పి. హెచ్.డి అయ్యాకా?" వారణాసిరావు నీరసంగా -" ఎప్పుడు పంపించటానికయినా పరిస్థితులు ఏమంత అనుకూలంగా లేవయ్యా. మనవాడు కాలేజీ బోర్డు ఎడ్మిషన్స్ టెస్టింగ్ ప్రోగ్రామ్- ఏ.టి.పి అంటార్లే- దానికి అమెరికాకు ముందర అప్లికేషను పెట్టుకోవాలి. ఆ తరువాత స్కాలర్‌షిప్ ఎఛీవ్‌మెంట్ టెస్టు- సాట్ అంటారు. టెస్ట్ ఆఫ్ ఇంగ్లీషు యాజ్ ఎ ఫారెన్ లాంగ్వేజ్- 'టోఫెల్' - అనేది. ఈ రెండు పరీక్షలు ఇండియాలో కొన్ని సెంటర్లో నిర్వహించబడేవి. ఈ పరీక్షల్లో రాసి నెగ్గాలి. నెగ్గినట్లు వాళ్ళు మనకు తెలియపరచగానే అమెరికాలో ఉన్న మనకు ఓపికున్నన్ని యూనివర్శిటీలకు అప్లికేషన్లు పెట్టుకోవాలి. ఈ అప్లికేషన్‌లో మనవాడు తనకు చిన్నప్పటినుంచి పరీక్షల్లో వచ్చిన మార్కులు, ఆటపాటల సర్టిఫికెట్లు వగైరాలు అన్నీ జతపరచాలి. ఇదంతా అయ్యేటప్పటికి ఏడాది తిరుగుతుంది. పిలుపొస్తే అప్పుడొస్తుంది."

"అక్కడ ఫీజ్ ఎంత?"..." నాకు బాగా తెలియదు. సుమారుగా పధ్నాలుగు వేల డాలర్లట అంటే లక్షా నలభైవేల రూపాయలు. అసలు అదృష్టం బాగుంటే పెద్ద యూనివర్శిటీల్లో తొమ్మిదివేల డాలర్ల దాకా స్కాలర్‌షిప్‌లు, నాలుగువేల డాలర్లదాకా అప్పు, ఎర్న్- వైల్ యూలెర్న్- స్కీమ్ కింద ఓ రెండువేల సంపాదన వస్తాయట. మనం పైసా పెట్టక్కర్లేదు పెట్టినా రెండుఏళ్ళకే వెనక్కు వచ్చేస్తుంది.".. " అప్పు తీసుకుంటే తీర్చడం ఎట్లా?"..." ఎట్లాగేంటి అక్కడే ఉద్యోగం చేసి... అసలు వెళ్ళేదెందుకయ్యా, అక్కడ స్థిరపడిపోవడానికి కాదూ! ముందర ఈ పరీక్షలు వగైరా గోలంతా సక్రమంగా జరగనీ."

సూర్యారావు ప్రాన్పడిపోయాడు ఎటోచూస్తూ ఉండిపోయాడు. ఉండి ఉండి చివరకు అన్నాడు- "ఇంతకీ మీ సన్నాసికి అమెరికా వెళ్ళడం ఇష్టమేనా?" ఊపుగా అన్నాడు వారణాసి రావు-" వాడికీ వయస్సులో ఇష్టాఇష్టాలు ఏమిటి? మనం ఏమి చెబితే అది. వాడేమంత సుముఖంగా లేడు. వాడికెంత సేపు మన గుళ్లూ , ఊళ్లూ, పొలంగట్లూ వీటి వెంబడి గడపడం ఇష్టం. అందుకని వెళ్ళనంటున్నాడు. అందుకని నేనే ఈ కరస్పాండెన్సు అంతా చేస్తున్నాను. తీరా సీటొస్తే వెళ్ళనంటాడా ఏంటి." సూర్యారావు అన్నాడు- "ఇట్లా అడుగుతున్నాని ఏమీ అనుకోకూ. ఒకవేళ సీటు రాకపోతే?"

వారణాసిరావు నవ్వాడు -"అమెరికా వెళ్ళి చదువుకునే మార్గాల్లేక పోలేదు. మన కుటుంబాలు వాళ్ళు కొందరు అమెరికాలో లేకపోలేదుగా. మా వాడు అమెరికాలో తనకొక అక్క ఉందనీ, ఆర్థికంగా తను ఆమె మీద ఆధారపడుతున్నాని అప్లికేషను పెట్టవచ్చు. అసలు వాడు తనకు మానసికంగా అస్థిమితంగా వుందని అక్క దగ్గరకు వెళ్ళాలని పెడ్తే మరీ తొందరగా పోయి వాలొచ్చు. లేదూ, ముందర మా ఆవిడ ఆమెరికా వెళుతుంది. దొంగ 'కూతురి' దగ్గరికి అక్కడ ఆమె ఏదో చిన్న ఉద్యోగంలో చేరుతుంది. మా వాడు తాను ఆమె మీద ఆధారపడ్డ వాడనే అంటాడు. అక్కడికెళతాడు... అసలింకో విషయం, టూరు పేరు చెప్పి అక్కడికెళ్లి భారతప్రభుత్వం తనను రాజకీయంగా ఇబ్బందులకు గురి చేస్తోందని చెప్పి రక్షణ పొంది కూడా అక్కడ స్థిర పడిపోవచ్చు జర్మనీలో ఇదీ మరీ తేలిక. అసలన్నింటికన్నా తేలిక

పద్ధతి తెలుసా గ్రీన్ కార్డు ఉన్న అమెరికాఅమ్మాయిని పెళ్ళిచేసుకోవడం. వాళ్లను పట్టుకోవడం ఏమంత కష్టం కాదు టూరిష్టు స్పాట్స్‌లో చాలామంది దొరుకుతారట."

సూర్యారావు తెల్లబోయి అన్నాడు- "ఇంత ప్రయత్నమా బావా? ఇన్ని మోసాల్తో అబ్బిన వాడి చదువు వాడికి గాని, నీకుగాని, సుఖశాంతులిస్తుందనే నమ్ముతున్నావా? వాడికక్కడ తగిన గుర్తింపు దొరక్క తగిన వుద్యోగం దొరక్కపోతే?"... "పర్వాలేదు ఇండియాలో బతకటంకన్నా వాషింగ్‌టన్‌లో వేరుశెనగలు అమ్ముకోవటం నయం. నేనూ నా భార్య కూడా వెళ్ళి పప్పు వేయించి ఇస్తుంటాము. వాడు వెళ్ళి అమ్ముతుంటాడు. అన్నట్లు మీ వాడి విషయం చెప్పావుకావు... ఈ మధ్య వాడు కనిపించడం లేదేంటి?"

సూర్యారావు తేరుకున్నాడు ఉత్సాహంగా అన్నాడు-" మావాడిదేముందిలే, ఇక్కడేఎక్కడో బి.టెక్ చదువుతాడు, అది దొరక్కపోతే బి.యస్ సి చదువుతాడు."..." ఇది నీ నిర్ణయమా, వాడి నిర్ణయమా?" ... "వాడికమెరికా వెళ్ళాలనేఉంది.కాని నాకే ఇష్టం లేదు."..." బాగుందయ్యా బావా, వెళ్లరా అంటే మావాడు వెళ్లనంటున్నాడు. నువ్వు వద్దంటే మీవాడు వెడతానంటున్నాడు. బాగుంది. ఇంతకీ నీకెందుకిష్టంలేదు.".. " ఎందుకిష్టం ఉంటుంది. ఇక్కడ పుట్టి ఇక్కడ పెరిగిన వాడు పోయి పోయి ఏదో దేశంలో తన తెలివిని ధారపోస్తానంటే!... అసలయినా పుట్టినపుడు ఈ దేశంలో నర్సు చేత బొడ్డు కోయించుకున్నవాడు, ఇక్కడ చింత చెట్టులెక్కి చిగురు కోసుకుని తిన్నవాడు, ఇక్కడ రిక్షా ఎక్కి స్కూలు కెళ్లినవాడు, ఇక్కడ ఫ్రీ ఎడ్యుకేషన్ అనుభవించినవాడు, ఇక్కడి క్రికెట్ ఆటగాళ్ళను మెచ్చుకున్నవాడు, ఈ సంస్కృతిలో భాగంగా బ్రతికినవాడు- ఎట్లా ఈ దేశాన్ని వదిలి ఇంకో దేశాన్ని సేవించగలడయ్యా? ఈ దేశపు యుద్ధవీరుల్నీ, ఈ సంస్కృతిలోని త్యాగధనుల్నీ, ఋషిపుంగవుల్నీ- అంత తేలిగ్గా ఎట్లా మర్చిపోగలడయ్యా? ఇక్కడ సూర్యోదయాల్ని మెచ్చుకున్నాడా, ఇక్కడ వసంతఋతు శోభను ఆనందించాడా, ఇక్కడ వేసవి వేడిని ముచ్చటగా తట్టుకుంటూ సబ్జాగింజనీళ్ళు తాగి, విసనకర్రతో విసురుకుంటూ, గడిపాడా... వాషింగ్‌టన్ వేడిలో ఎట్లా బ్రతకగలడయ్యా! హటాత్తుగా ఈ గడ్డను తిరస్కరించి వెడుతున్నాడే ఆ భూమి గురించీ, ఆ సంస్కృతి గురించీ, ఆ బాష గురించీ తెలుసా? ఈ భూమి పట్ల శ్రద్ధాభక్తులు వదులుకుంటున్నాడు బాగానే ఉంది. ఆ భూమి పట్ల 'నాది' అన్న భావం పెంచుకోగలడా! రెంటికీ చెడ్డ రేవడి అయితే దిక్కేమిమిటి?"

వారణాసిరావు మాట్లాడలేదు. కొంతసేపటికి ఇద్దరూ విడిపోయారు.. సూర్యారావు కొడుకు "బావతోపాటే నేనుకూడా అమెరికా వెళ్లి చదువుకుంటా నాన్నా" అని అన్నప్పుడల్లా సూర్యారావు వారణాసిరావుతో తానన్నమాటల్నే కొడుకుతో అంటుండేవాడు. ఆ కుర్రాడు చికాకు పడుతుండేవాడు.

★ ★ ★

వారణాసిరావు కొడుకు హైదరాబాదు వెళ్లి, సాట్, టోఫెల్ పరీక్షలు రాసొచ్చాడు. ఆ రెండింటిలోనూ పాసైనట్లుగా జనవరిలో తెలిసింది.

సూర్యారావు తన కొడుకు చేత జెయన్ టి యు పరీక్షకు కట్టించాడు. ఆ కుర్రాడు "కనీసం ఐ ఐ టి కైనా నన్ను సెలక్టవనియ్యి. అట్లా అయినా ఫారెన్ వెడతాను ఎమ్ టెక్ కి" అన్నాడు "అందుకనే ఐ ఐ టి కి పంపించను " అన్నాడు తండ్రి. వేసవికాలం అవ్వచ్చేటప్పటికి కొలంబియా యూనివర్శిటీ

నుంచి వారణాసిరావు కొడుక్కి సీటొచ్చింది కాని- స్కాలర్‌షిప్ విషయం తరువాత తెలుస్తాం- అన్నారు వాళ్ళు సరిగ్గా అదే సమయానికి వారణాసిరావు పెద్దకూతురుకి మంచి సంబంధం తెచ్చిపెటారెవరో. పెళ్ళి జరిపించకతప్పలేదు. అనుకోకుండా అర లక్ష ఖర్చు అవటంతో కుచేలుడయిపోయాడు వారణాసిరావు. నెల తరువాత కొడుకుని అమెరికాకు విమానం ఎక్కించి వచ్చేటప్పటికి చేతిలో పైసా లేదు అతనికి. భార్య బంగారం కొంత అమ్మాడు. ఇల్లు తాకట్టు పెట్టాడు. తనకన్నా స్థితిమంతుడైన తన బావ సూర్యారావు దగ్గర కూడా అప్పుచేయక తప్పలేదు అతనికి. అప్పుల్లో కూరుకుపోయాడు. కూతురు పెళ్ళివచ్చిపడకపోతే అతనంత ఇబ్బందిపడకపోను. ఆ పెళ్ళి చేయక తప్పలేదు మరి. సూర్యారావు కొడుకు గునుస్తూనే విశాఖపట్నంలో బి.టెక్‌లో చేరాడు.

★★★

నాలుగేళ్ళు గడిచాయి. సూర్యారావు తన కొడుకుతో " గేట్ పరీక్షరాసి కాన్పూరులో ఎమ్.టెక్ చెయ్యి.ఆ తర్వాత ఎమ్.బి.ఎ చేద్దువు గాని. భవిష్యత్తు బాగుంటుంది" అన్నాడు. వాడు" కాదు ఇప్పుడైనా అమెరికా వెళ్లనీ, బోలెడు సంపాదించవచ్చు, సుఖపడొచ్చు" అన్నాడు.

సూర్యారావు నవ్వాడు-" సుఖం డబ్బుతోనే ఉందనుకుంటున్నావా? పోనీ శాంతి మాటేమిటి? మనశ్శాంతి కోసం అమెరికన్‌లు తపించుపోతున్నారనే విషయం తెలుసా? కనీస అవసరాలు తీరిన తర్వాత , కొంత భోగావసారాలు తీరిన తర్వాత- డబ్బునీకు బరువవుతుంది. అసలైనా సుఖమనే దేమిటి? రెండు కష్టాల మధ్య ఉండే శూన్యం. ఒకమాదిరి భోగాలు ఈ దేశంలో ఉండికూడా అనుభవించొచ్చు. ఎండమావులకు భ్రమపడకు. కావలిస్తే ఉద్యోగంలో చేరాక నీ పెళ్లాం బిడ్డల్తో ఏ డెప్యుటేషన్ మీదో నీ కిష్టమైన దేశం వెళ్ళి నీకిష్టమైనంత కాలం ఉండు. కానీ వెనక్కి మాత్రం తిరిగి రా. నువ్వు పుట్టింది ఇక్కడ! గిట్టవలసింది కూడా ఇక్కడే". వాడు ఒప్పుకున్నాడు. " నా మంచి గురించి ఆలోచించేవాళ్ళు నీ కన్నా నాకెవరున్నారు?... నీ ఇష్టమే నా ఇష్టం" అన్నాడు. కాన్పూరులో యమ్.టెక్‌లో చేరాడు.

★★★

ఆ పై ఏడాది వేసవి కాలంలో వారణాసిరావు కొడుకు అమెరికానుంచి వచ్చాడు. వాడు రాకతో కూడబలుక్కున్నట్లు మంచి కట్నంతో వచ్చిన పెళ్లి సంబంధం చూసి కొడుక్కి పెళ్లిజరిపించేసాడు. ఇహ మీ ఇద్దరూ ఎక్కండి విమానం" ... " ఎక్కడికి?" అడిగాడు కొడుకు.

" అమెరికాకి"

" ఎక్కను... అక్కడి వాతావరణం నాకు మొహం మొత్తింది. ఎంత కష్టపడ్డా ఎంత గొప్ప ఇంజనీరయినా భారతీయుడంటే అక్కడ రెండో తరగతి పౌరుడే. ఇక్కడే ఏదో మంచి కంపెనీలో చేరానంటే పదేళ్ళలో ఎమ్.డి నై కూర్చుంటాను."…. "ఇంకా నయం. పెసరకాయలు, తాటిముంజలు ఏరుకుంటూ , కవిత్వం రాసుకుంటూ పొలంగట్లు మీద దొర్లుతానన్లేదు.. వెర్రి మొహమా పదేళ్ళలో పాతిక లక్షలు సంపాదిస్తావురా అమెరికాలో. పద పద, నీ వెనకాలే మేమిద్దరం కూడా వస్తున్నాం చెల్లాయికి పెళ్లి చేసేసి. పోనీ పదేళ్ళుండి రా చాలు!"

వారణాసి రావు స్వయంగా పెళ్లికొడుకునూ కోడల్నీ విమానం ఎక్కించి వచ్చాడు. కొంచెం

ఇంచుమించుగా అదే ముహూర్తానికి సూర్యారావు కూడా తనకొడుక్కు పెళ్లిచేసాడు ఏడాది గడిచింది. వాడికి హైదరాబాదులో టి.వి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఇంకో రెండేళ్ళు గడిచాయి. వాడికొక కొడుకు పుట్టాడు. వాడిభార్య భర్తతో అంది ఒకరోజున-" ఏమండి మీ మావగారబ్బాయి అమెరికా వెళ్లాడుకదా మనంకూడా వెళ్లి అక్కడే సెటిలవుదామండి."

భర్త అన్నాడు-" సరదాగా వెళ్ళి ఓ రెండేళ్ళో మూడేళ్ళో ఉండి తిరిగొచ్చే అవకాశం రాకపోదు. అక్కడే సెటిలవదామనుకోడం మంచిదికాదని, నిజంగా మనం మంచికోరే పెద్దలంతా చెబుతున్నారు. అక్కడి తాగుడు పబ్స్ లో మునిగి కాసినోల్లో తేలి మనంపాడయిపోతామని నేననటం లేదు. కానీ అక్కడ అయిదారేళ్ళ పిల్లలు తల్లున్ని విడిచిపోయి బోర్డింగు స్కూళ్లల్లో చేరతారు. నువ్వు నీ పిల్లాణ్ణి విడిచి ఉండగలవా?... ఇదే ప్రశ్న ఒక్కగానొక్క కొడుకునైన నన్ను అడుగుతున్నారు. ఏం చెప్పమంటావో చెప్పు!"

" అమ్మబాబోయ్, పిల్లాణ్ణి విడిచిపెట్టి మనం ఎక్కడో ఉండాలా! అయితే వద్దండీ!"... " అందుకే వద్దంటన్నాను. మొదట్లో నేనూ నీలాగే ఊగినవాణ్ణే . అక్కడి కెళ్ళిన వాళ్ళు చెబుతున్నది వింటూవుంటే జ్ఞానోదయమయింది నాకు."

★★★

పది పన్నెండేళ్ళ గడిచాయి. వారాణాసిరావుకు అతని కొడుకు దగ్గర్నుంచి మొదట్లో ఉప్పెనలాగా వస్తూవచ్చిన ఉత్తరాలు వేసవి జల్లుల్లాగా క్రమంగా తగ్గిపోవటం మొదలై ఇప్పుడు ఆరేసి నెలల కోటి రావటం కూడా గగనమై పోయింది. అతను పెంచుకున్న ఆశలు అడియాసలయ్యాయి. ఆ దంపతుల్ని అమెరికా రమ్మనమని పొరపాటున కూడా ఒక్క ఉత్తరం ముక్క రాలేదు అమెరికానుంచి. ఇద్దరు కూతుళ్ళూ ఎక్కడో ఉత్తర దేశంలో కాపరాలు చేసుకుంటున్నారు. పైపెచ్చు వారాణాసిరావుకు పక్షవాతం వచ్చి తగ్గింది. ఉన్న ఒక్క కొడుకూ దగ్గరలేడు. ఒక్క కూతురూ రమ్మనదు! ఆ దంపతుల ఆవేదనకి అంతంలేదు.

హఠాత్తుగా అమెరికానుంచి ఉత్తరం ఒకటి ఊడిపడింది.- " నాన్నగారికి-మిమ్మల్నిక్కడికి ఆహ్వానించలేదని బాధపడకండి. మీకు అక్కడలేని శాంతి ఇక్కడా ఉండదు. అసలు ఏం చూసి ఆనందిద్దామని మీరిక్కడికి రావాలి?.. ఇక్కడి వాతావరణంలోనే పూర్తిగా పుట్టి పెరగడంవల్ల మా పెద్ద మనవడికి ఇంగ్లీషు, స్పానిష్ తప్ప మరే భాషా రాదనీ , పాతికేళ్ళ వాడికి తెలిసే విషయాలన్నీ వాడికి ఇప్పుడే అనుభవంలోకొచ్చేశాయని తెలుసుకోటానికా! మీ మనవరాలు తన స్కూలు బాయిస్‌తో కలిసి ఏరోజున ఏ పక్కకి డేటింగ్‌కెళ్లిందో పరిశీలించటానికా ! మీ చిన్న మనవడు, ' డాడీ, నీ మాతృదేశమైన ఈ అమెరికా కోసం నా రక్తం ధారపోస్తాను. సైన్యంలో చేరతాను.' అనే మాటలు వినటానికా! మన దేవుళ్లనీ మన పూజా పునస్కారాలనీ పూర్తిగా మర్చిపోయి, ఏ దేవుడికి మొక్కుకోవాలో తెలీక, అప్పుడప్పుడు తన్ను కోచ్చే గుండెగుబులు మర్చిపోవటానికి మత్తుమందు షాట్స్‌కు బానిసలమయిన మమ్మల్ని చూసి ఆనందించటానికా? దేనికోసం వస్తారు అమ్మామీరు? ... ఈ గడ్డమీద నేను పాతుకుపోయాను . రాకెట్లు ఉపయోగించే ఎలక్ట్రానిక్స్ చిప్స్‌ను తయారుచేసే ఫాక్టరీని నడుపుతున్నాను . వందమంది భారతీయులకి ఇక్కడ ఫాక్టరీలో పని కల్పించాను. అమెరికన్ సమాజంలో మేము అంతర్లీనం కాలేక పోతున్నాం.మేము

ఎంత ప్రయత్నించినా అమెరికన్లు మమ్మల్ని రెండో తరగతి పౌరులుగానే చూస్తున్నారు. పైగా, దక్షిణాఫ్రికా, బ్రిటన్‌ల్లో వాళ్ళు మమ్మల్ని ఎప్పటికైనా తరిమేస్తారేమోననే భయం కూడా మాకుంది. భారతదేశం వచ్చేయాలనుంది. కానీ రాలేము. చుట్టపు చూపుగా ఇండియా ఎప్పుడైనా రాగలిగితే వస్తామేమో! అదయినా దగ్గర్లో మాత్రం కాదు. మీ ఆరోగ్యం బాగున్నట్టు రాయగలరు...''

ఈ ఉత్తరం అందిన వారానికి పక్షవాతం తిరగబెట్టి క్షోభించి క్షోభించి 'హరీ' మన్నాడు వారణాసి రావు. ఈ వార్త విన్నాడు సూర్యారావు. హైద్రాబాద్‌లో సొంతంగా ఎలక్ట్రానిక్స్ చిప్స్ ఫాక్టరీనే పెట్టి కొన్ని వందలమందికి తిండి ప్రాప్తి కలిగించిన తన కొడుకు దగ్గర ఉన్నవాడల్లా, ఉన్నవాడు ఉన్నట్టుగా తన భార్యా, కొడుకు, కోడలూ వాళ్లపిల్లల్తో సహా వచ్చి వాలాడు. కర్మంతా సవ్యంగా జరిపించాడు. విధవ చెల్లెల్తో (వరస చెల్లెలు) తిరుగు ప్రయణమవుతూ కొడుకుతో అన్నాడు. ''ఈ క్విట్ ఇండియా ఉద్యమం ఆగితేనే గాని మనదేశం బాగుపడదురా. మీ ఇంజనీర్స్ అసోసియేషన్‌లో మూవ్‌చేసి దీని ఆపేందుకు పథకాలాలోచించరా నాన్నా!'' అని.

(కృష్ణా పత్రిక 1984)

★★★ ★★★ ★★★

# భారత మహిళా, మళ్ళీ జోహార్!

ఏలూరెళ్ళటానికి నేను రాజమండ్రిలో మెడ్రాస్ మెయిలెక్కాను. జనరల్ కోచ్ ఎక్కాను. నా చిన్నప్పట్నుంచీ ఉన్నట్టుగానే అప్పుడు కూడా పెట్టె జనంతో కిటకిటలాడిపోతోంది. ఆ తోపులాటలో ఎక్కువదూరం వెళ్లలేక నేను తలుపు పక్కనున్న ఫోర్ సీటర్ల మధ్య కెళ్ళి నుంచుండిపోయాను. ఫ్లాట్ ఫారం వైపు చూస్తూ నుంచున్నాను. నాకెడం పక్క ఫోర్ సీటర్‌కి పైనున్న అటకమీద తెల్లజాతి యువకుడొకడు పడుకొని ఏదో నవల చదువుకొంటున్నాడు. దాని కెదురు అటకమీద అదే జాతి యువతి ఒకత్తె జీన్సూ చొక్కాల్లో కూర్చొనుంది. ఒళ్ళో ఉన్న ఊలు ఉండతో చిన్న స్వెట్టర్ అల్లుతూ, నోట్లో ఉన్న సిగరెట్‌తో దమ్ము పీలుస్తూ మధ్య మధ్య ఆ యువకుడితో ఆమె ఇంగ్లీషులో ఏదో మాట్లాడుతోంది. వాళ్లిద్దరి సంభాషణలో అక్కడక్కడ నాకర్థమైన 'త్రో డౌన్ ఫ్రమ్ ది గోల్డెన్ గేట్ బ్రిడ్జ్', 'దీజ్ నేటివ్ బగ్గర్స్' ... వగైరా మాటలను బట్టి వాళ్ళు అమెరికన్లని గ్రహించాను. అయితే భార్యా భర్తల్లో, లేకపోతే కలిసి బతికే రకం ఫ్రెండ్సో అయ్యుంటారని కూడా అనుకున్నాను. బహుశా, మద్రాసులో విమానం ఎక్కడ కోసం ఆదరాబాదరా ఈ పెట్టెలోకి వాళ్ళెక్కారేమోనని కూడా నాకనిపించింది. ఇంతలో ఫ్లాట్ ఫారం మీదకి అరటిపళ్ల బండొచ్చింది. ఆరు రూపాయలిచ్చి పాతిక అరటిపళ్ళు కొన్నారు వాళ్లు. వాళ్ళని చూసి చూసి ఇక సభ్యత కాదనుకొని, తలొంచుకొని ఏదో ఆలోచించుకుంటూ నుంచుండిపోయాన్నేను.

రెండు నిముషాలు గడిచాయె లేదో నా కుడివైపు ఫోర్ సీటర్లోంచి, అంటే ఆ అమెరికన్ స్త్రీ కి కిందగా కూర్చోనున్న మగాళ్ళలోంచి కలకలం బయల్దేరింది. ఒక యువకుడు అంటున్నాడు-'' ఏటిది, యీ యమ్మకి మతిగాని మాసిపోనాదేటి? అరిటిపండు తొక్కని బుర్రమీద కొగ్గేస్తాంది. కింద కూసున్నోల్లు మణుసులనుకున్నాదా, మేకలనుకున్నాదా?''